# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-10-2023 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కృష్ణానదీ జలాల వివాదానికి సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ పొడిగింపు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు.
- ❖ ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఆర్చరీలో మూడో బంగారు పతకం సాధించిన తెలుగుతేజం జ్యోతి సురేఖకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.
- ❖ ఇజ్రాయెల్‌లో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, అక్కడి భారతీయ పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.
- ❖ మొలాసిస్‌పై జీఎస్టీని 5 శాతానికి తగ్గిస్తూ జీఎస్టీ కౌన్సిల్ ఈరోజు తీసుకున్న నిర్ణయంతో చెరుకు రైతులకు మేలు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణానదీ జలాల వినియోగానికి సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్ ను పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్రానికి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన విజయవాడలో జరిగిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ... బచావత్ ట్రిబ్యూనల్ అనుసరించి నీటి పంపకాలు ప్రామాణికంగా జరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితిలో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్ కు విధి విధానాలు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసి న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. నీటి వాటాల విషయంలో రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరిగితే సహించబోమని పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఆర్చరీలో మూడో బంగారు పతకం సాధించిన తెలుగుతేజం జ్యోతి సురేఖకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆసియా క్రీడల్లో భారత్ వంద పతకాల మైలు రాయిని అధిగమించిన నేపధ్యంలో సామాజిక

మాధ్యమం వేదికగా ఒక ప్రకటన చేస్తూ... క్రీడాకారుల అంకితభావం, నైపుణ్యం భారత్‌కు అసాధారణ విజయాలను అందించాయని ప్రధాని శ్లాఘించారు. స్వర్ణ పతకం సాధించిన భారత కబడ్డీ మహిళల జట్టును, కాంపౌండ్ ఆర్చరీ పురుషుల వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ఓజాస్ ప్రవీణ్ డియోటాలేను, రజత పతకం సాధించిన అభిషేక్ వర్మను, కాంస్య పతకాన్ని సాధించిన అదితి గోపీచంద్ స్వామిని ప్రధాని అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడల్లో 100 పతకాలు సాధించిన భారత క్రీడాకారులకు కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ అభినందనలు తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల తరఫున ఆటగాళ్లందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు పేర్కొంటూ...వీరంతా భావి క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తారని వ్యాఖ్యానించారు. 72 ఏళ్ల ఆసియా క్రీడల చరిత్రలో భారత్ క్రీడాకారులు ఎన్నో రికార్డులు సృష్టించారని, ఈసారి అథ్లెటిక్స్ లో 29 పతకాలు, షూటింగ్‌లో 22 పతకాలు సాధించి కొత్త రికార్డులు నెలకొల్పారని కేంద్ర మంత్రి వివరించారు. కాగా... ఈ 19వ ఆసియా క్రీడల్లో భారత్ ఇప్పటివరకు 28 స్వర్ణ, 36 రజిత, 41 కాంస్య పతకాలు సాధించింది.

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మొలాసిస్‌పై జీఎస్టీని 28 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈరోజు ఢిల్లీలో జరుగుతున్న జీఎస్టీ 52వ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయంతో చెరుకు రైతులకు మేలు జరగనుంది. అదేవిధంగా 70 శాతం చిరు ధాన్యాలను కలిగి ఉన్న పిండిని ప్యాకింగ్ లేకుండా విక్రయిస్తే జీఎస్టీ మినహాయింపు వర్తించేలా... అదే ప్యాక్ చేసి, లేబల్‌తో విక్రయిస్తే 5 శాతం జీఎస్టీ వర్తించేలా సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరితో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇజ్రాయెల్‌లో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, అక్కడి భారతీయ పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అక్కడి అధికారుల సూచనల మేరకు భద్రతను పాటిస్తూ ఉండాలన్నారు. అనవసరమైన ప్రయాణాలను మానుకోవాలని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని స్పష్టం చేశారు. మరింత సమాచారం కోసం ఇజ్రాయిల్ వెబ్ సైట్ **https://www.oref.org.il/en** ను సందర్శించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో **cons1.telaviv@mea.gov.in.** వెబ్ సైట్ లేదా **+97235226748** నెంబరులో భారత కాన్సులేటును సంప్రదించాలని లేదా మెసేజ్ చేయాలని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

కీలక రంగాలకు చెందిన సంస్థలకు సేవలందిస్తూ... విశాఖపట్నం పోర్ట్ అథారిటీ...10 దశాబ్దాలకు పైగా దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతోందని చైర్ పర్సన్ డాక్టర్. ఎం. అంగముత్తు తెలిపారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ 90వ ఆవిర్భావ దినోత్సవాలు ఈరోజు విశాఖలో ఘనంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఆయన ప్రకటన చేస్తూ... కీలకమైన పనితీరు సూచికలలో పోర్ట్ అథారిటీ గణనీయమైన అభివృద్ధిని చూపిందన్నారు. కార్గో వాల్యూమ్‌లు 3 శాతం, టర్నరౌండ్ టైం 17 శాతం పెరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా కంటైనర్ టెర్మినల్ 38% వృద్ధి నమోదు చేసిందని, గత ఆర్థిక సంవత్సరంలో 2.48 లక్షల యూనిట్లు ఉండగా... ఈ ఆర్థిక సంవత్సరం 3.4 లక్షల యూనిట్లకు చేరిందని వివరించారు. రెండు కొత్త కంటైనర్ లైనర్లు ఈ టెర్మినల్ నుండి తమ కార్యకలాపాలను ప్రారంభించాయని తెలియజేశారు.

======================

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహిస్తూ శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉండాలని శ్రీకాకుళం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.ఆర్. రాధిక విజ్ఞప్తి చేశారు. ఈ ఉదయం ఆమె ఎచ్చెర్లలో సాయుధ పోలీసు దళాలు నిర్వహించిన పరేడ్ కార్యక్రమానికి హాజరయ్యి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోలీసు శాఖలో క్రమశిక్షణ చాలా ఆవశ్యకమని, ప్రతి ఒక్కరు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. పోలీసులు విధిగా హెల్మెట్ ధరించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

======================

యోగా, సూర్యనమస్కారాల వంటి సాధనలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. ఒంగోలు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 600 మంది విద్యార్థులతో 108 పర్యాయాలు సూర్యనమస్కారాలు చేసే కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... గత మూడు నెలలుగా విద్యార్థులు సూర్యనమస్కారాలు అభ్యాసం చేస్తున్నారన్నారు. త్వరలో ఒంగోలులో 2వేల మంది విద్యార్థులతో సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

======================

విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకుని, శాస్త్రవేత్తలుగా రాణించాలని టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారి సదా భార్గవి ఆకాంక్షించారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా తిరుపతి గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలో స్పేస్ ఎగ్జిబిషన్ ను ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అంతరిక్ష పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తల కృషి వెలకట్టలేనిదన్నారు. టీటీడీ పాఠశాలల విద్యార్థులకు శ్రీహరికోటలోని షార్‌ను సందర్శించేందుకు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

======================

ఈ నెల 21వ తేదీన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సేవలను కక్షిదారులు వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసుల నాయక్ సూచించారు. ఈరోజు ఆయన శ్రీకాళహస్తి లో పత్రికా సమావేశం మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, రెవెన్యూ సమస్యలు తదితర కేసులను లోక్ అదాలత్ ద్వారా సత్వరం పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

======================

వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తిరుపతి జంతు ప్రదర్శనశాల క్యురేటర్ సి.సెల్వం అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... అటవీ ప్రాంతాలలో అనేక రకాల వన్యప్రాణులు ఉంటాయని, వాటి సంరక్షణ బాధ్యత అధికారులతో పాటు ప్రజలపై కూడా ఉందని పేర్కొన్నారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

======================

ఆంధ్ర రాష్ట్రం అప్పుల్లో ఉందన్న ప్రతిపక్ష ఆరోపణల్లో ఎంత మాత్రం నిజం లేదని అటవీ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఈరోజు ఆయన తిరుపతిలో పుంగనూరు నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిడిపి రేటింగ్ ఆధారంగా రాష్ట్రంలో అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవాలని సూచించారు. కరోనా కష్టకాలంలో కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుపేదలందరికీ ప్రభుత్వ పథకాలను అందించారని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

========================

రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుండి 6 శాతానికి తగ్గిందని పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు ఆయన తిరుపతిలో పత్రికా విలేఖర్లతో మాట్లాడుతూ... పేదరికం తగ్గిన విషయంపై నీతి ఆయోగ్ నివేదిక ఇవ్వడం జరిగిందని, జీడీపీ రేటు సైతం రాష్ట్రంలో బాగుందని మంత్రి తెలియజేశారు.

========================

========================